# పురిటి నెప్పలు

"కోటప్ప కొండ కెళ్లి యేం తెచ్చావే?"

చేలోకి దిగుతున్న వందనాన్ని చూసి నవ్వుతూ అడిగింది మరియమ్మ.

"నా బొంద. యేంది తెచ్చేది? కొబ్బరికాయ  కొట్టి ఒక దణ్ణం పెట్టి వచ్చా. తేటానికి చేతిలో దమ్మిడీ వుందెట్టా - "మూతి తిప్పుకుంటా చెప్పింది వందనం.

"కొడుకు పుడితే మల్లొత్తానని మొక్కుకోలా?" యెగతాళిగా అంది అన్నమ్మ.

"ఎందుకు తల్లా - రెండు శత్తులు పుట్టాయిగా - చాల్లే" పనిలోకి వంగబోతూ నవ్వింది వందనం.

" నువ్వు చాలంటే సరిపోద్దా. మా తమ్ముడు వూరుకోవద్దూ."

"నేనుమటికి కొడుకునికనకుండా చాలించుకుంటానెట్టా" పోటీగా అంది వందనం.

"అన్నీ నువ్వే అంటావేందే బడాయి" వందనం బుగ్గ పొడిచింది. వాళ్లు ముగ్గురు మరో ముగ్గురు అమ్మాయిలతో కలిసి పత్తికట్టె పీకుతున్నారు. శివరాత్రి వెళ్ళి యెండలు నెమ్మదిగా వస్తున్నాయి.

సంక్రాంతికి ముందుగా పత్తి వొల్చిన చేలల్లో పత్తికట్టె పీకిస్తున్నారు రైతులు.

వందనం, మరియమ్మ, అన్నమ్మ నడుం వొంచి పనిలోపడ్డారు. ఒక గంట సేపు మాటా పలుకూలేకుండా పని ముమ్మరంగా సాగింది. అన్నమ్మకు కళ్ళు తిరిగినట్లయి కూచున్నచోటే కూలబడింది.

"ఎందే - యేవయింది" అంటూ అందరూ చుట్టూ కమ్ముకున్నారు.

"యేందోనే కళ్లు తిరిగినట్లయింది"

"కడుపుతున్నావా యేంది?" వందనం కుతూహలంగా చూసింది.

"కడుపూ లేదు - గడ్డలూ లేదు. వారం నుంచీ అదేమైన మైలవుతుంది."అన్నమ్మ ముఖమంతా బాధతో మెలిదిరిగి పోయింది. చమటలు పట్టుకొచ్చాయి. పొత్తి కడుపు పట్టుకుని ఒకటే మూలుగుతోంది.

"డాక్టరమ్మ దగ్గరికి పోదాం లేవే" అంది వందనం.

"నే(నాను తల్లో - నాల్నెల్లనాడు ఆస్పత్రికి పోయి చూపిచ్చుకున్నప్పట్నించే నాకీ తిప్పలు -" అన్నమ్మకు ఆస్పత్రి పేరెత్తితే యేడుపొచ్చేటట్టయింది.

"యేం చేశారెట్టా - అసలెందుకు పోయా?"

"ఎందుకంటే - పిల్లగాడు రొమ్మిడిశాడు. మల్లా కడుపొత్తందేవోనని, ఆసిపత్తిర్లో

మాత్తర్లు పెడతన్నారు కడుపురాకుండా నంటే పొయ్యానమ్మా. మాత్తర్లు కాదంది. లోపల పరిచ్చేసి యేందో చెప్పింది. కడుపురాదంది. కడుపురాటం అట్టావుంచి ఈ తిప్పలెక్కువైనై' ' అంది అన్నమ్మ అక్కడే పక్కకి ఒరిగి కాళ్ళు పొట్టలోకి వొచ్చేట్టు ముడుచుకుపడుకుంది.

"పేట పొయ్యి మంచి డాట్టరు కాడ చూపిచ్చుకోరాదే"

"డబ్బులేడదెచ్చి?"

ఇంతలో చేలో పని సరిగ్గా జరుగుతాందోలేదోనని అజమాయిషీ చెయ్యటానికి వచ్చిన మాణిక్యమ్మ పని జరగకపోగా అందరూఒకచోట గుంపుగా వుండేసరికి కేకలు మొదలుపెట్టింది. ఆమెకు లోపల యింకో భయం కూడా వుంది. పత్తి ఒల్చే రోజుల్లోకూలి పెంచాలని కూలీల గొంతులు లేసినయ్ - ఒక రోజు 'పని ఆగిపోద్ది' అని రైతులందరికీ అనుమానం కూడా వచ్చింది. ఆ వూళ్ళో అంతపని యెన్నడూ జరగలేదు. ఆడముండలూ, పిల్లలూ కల్సి పత్తి ఒల్సి యెక్కడలేని డబ్బా కూలికింద లాక్కుపోతున్నారని రైతులు విసుక్కుంటుంటే యింకా కూలి పెంచాలనే సరికి రైతులు అగ్గిరాముళ్ళై పోయారు.

మాణిక్యమ్మకు ఆ సంగతి గుర్తొచ్చి అంత దూరాన్నించే అరుస్తా వచ్చింది.

"అన్నమ్మ కళ్ళు తిరిగి పడిందండి"

మాణిక్యమ్మ దగ్గరకొచ్చేసరికి అన్నమ్మ మూలుగు మోపైంది.

"దాన్ని ఆస్పత్రికి తీసకపోండి. నా చేలో యెందుకీ దరిద్రం. యియ్యాళ సగం చేనన్నా అయిద్దనుకున్నా. ఇట్టయితే అయినట్టే-"

మాణిక్యమ్మ గొణుక్కుంటూ తనూ పత్తికట్టె పీకటం మొదలు పెట్టింది.

వందనం అన్నమ్మను లేవదీసి మెల్లిగా నడిపించుకుంటూ తీసికెళ్ళింది.

మరియమ్మ మాట్లాడకుండా పని చేసుకుంటోంది.

* * *

భయపడినా మళ్ళీ ప్రభుత్వాసుపత్రికే వెళ్ళక తప్పలేదు అన్నమ్మకు. ఆ వూళ్ళో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వుంది. సంవత్సరం నుంచీ ఒక డాక్టరమ్మ కూడా వుంది. చిన్న చిన్న బాధలకు ఆడవాళ్ళు ఈ ఆస్పత్రికి వెళ్తున్నారు. పెద్ద బాధలనుకుంటే ఆర్.ఎం.పీ.ల దగ్గర కెళ్తే వాళ్ళు చిలకలూరిపేటలో వున్న పెద్ద డాక్టర్ల దగ్గరకు తీసికెళ్తారు. ఆర్.యం.పీలు, పేటలోని డాక్టర్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఈ మూడింటి చుట్టూ తిరుగుతుంటారు, ఆ వూరి ఆడవాళ్ళు, తమ కోసం తమ వాళ్ళ కోసం. అన్నమ్మ వెళ్ళిన సమయానికి డాక్టరమ్మ వుంది. ఐతే నాలుగు నెల్లనాడు అన్నమ్మకు 'కాపర్ టీ' పెట్టిన డాక్టరమ్మ కాదు. ఆవిడ బదిలీ అయి కొత్తావిడ వచ్చి వారం రోజులే అయింది. అన్నమ్మను చూస్తునే డాక్టర్‌కు

పరిస్థితి అర్థమైంది. అన్నమ్మకు ఇంజక్షన్ యిచ్చి కాపర్ టీ తీసేసింది. లోపల యిన్‌ఫెక్షన్ తగ్గటానికి మందులు యిచ్చింది.

" ఓ వారంలో తగ్గిపోతుందిలే - నీకు పిల్లలెంతమంది."

"నలుగురండి"

"మరి ఆపరేషను చేయించుకోరాదూ"

"కొడుకు ఒక్కడేనండి. ఇంకో కొడుకుని కన్నాక చేపిచ్చుకుంటానండి"

"ఈసారి కొడుకు పుడతాడని యేముంది. మళ్ళీ యింకో యిద్దర్ని కంటే నీ పని అయిపోతుంది. ఐనా నలుగురు పిల్లలు చాలరా?" డాక్టరు కాస్త వ్యంగ్యంగా అంది.

"ఆస్తులుండే వాళ్ళకు పంచుకుంటే తలాకాస్త రాదని బయ్యం. మాకేముందండీ - పిల్లలకి రెక్కలొస్తే ఆళ్లే ఆస్తులనుకుంటాం"

ఈ సమాధానం వందనం యిచ్చింది. డాక్టరు ముఖం చిట్లించింది.

"మాటలకేంగాని, ఆరోగ్యం పాడయిపోతుంది. ఆలోచించుకో" అన్నది తనకేం పట్టనట్టు. ఆవిడ ఆ రెండు మాటలు కూడా సామాన్యంగా మాట్లాడదు. కానీ అది మార్చి నెల. ఆపరేషన్ల టార్గెట్ వుంది. ఆ బాధ్యత ఆమె మీద అంతగా లేదు గానీ యేదో తన వంతు తనూ చెప్పినట్లుంటుందని అన్నది. వినకపోతే వాళ్ళ ఖర్మ.

"నాలుగు కాన్పులు తేలిగ్గానే అయినయ్యండి. ఇంటోనే మంత్రసానొచ్చి చేసేసిందండి. ఈతూరి యెంటెంటనే రాకుండా మాత్తార్లిస్తారంటే సరేగదా అని వొత్తే ఆ డాట్టరమ్మ నా పేణం తీసింది"

"సరే, వెళ్ళండి" అని డాక్టర్ వాళ్ళను పంపింది. మాత్రలు సరిగ్గా వేసుకోరని కాపర్‌టీలు పెట్టమంటారు అధికారులు. అది సరిగా అమర్చకపోయినా, పెట్టేటపుడో తర్వాతో అపరిశుభ్రమైన వాతావరణం వున్నా యిట్లాంటి కాంప్లికేషన్సు వస్తాయి. జనాభా తగ్గించండి అనే కేకలే గాని ఆడవాళ్ళ ఆరోగ్యం గురించి యెవరికీ శ్రద్ధ లేదు.

డాక్టర్ వనజ కొత్తగా గవర్నమెంటు వుద్యోగంలో చేరింది. అంతకు ముందు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో పనిచేసేది. అన్నమ్మ, వందనం మందులు తీసుకుని వెళ్ళిపోయాక కాంపౌండర్ నారాయణ అన్నాడు.

"అట్లా వదలకూడదమ్మా. మార్చి నెల సగమైంది. మనకీ అవసరమే. ఇక బతకవని భయపెట్టి ఆపరేషను చేసెయ్యాలి"

"ఆమె చేయించుకోనంటుంది. ఇంకా యిద్దర్ని కంటుందట" నిరసనగా చీదరగా అంది వనజ.

"వాళ్ళిష్టమేనేంటి? అట్లాగయితే ఈ మాల మాదిగ ముండల్లో ఒక్కదానికీ చెయ్యలేం ఆపరేషను."

"బాగానే వుంది. కట్టేసి చేస్తామా?"

"అవసరమైతే చేసెయ్యటమే. టార్గెట్టు పూర్తి కావొద్దూ"

నవ్వాడు నారాయణ. ఇంతలో యింకో ముగ్గురు పేషెంట్లొచ్చారు. వాళ్ళను చూసి మందులిచ్చి పంపేసింది వనజ. ఈ యెండలు, ఈ వుద్యోగం,ఈ కాంపౌండర్, అతని బూతులు అన్నీ చిరాగ్గానే వున్నాయి వనజకు.

గవర్నమెంట్ వుద్యోగం వొదులుకోలేదు. ఈ పల్లెటూళ్ళో బతకలేదు. కాలేజీలన్నీ సిటీల్లో, టవున్‌లలో వుంటాయి - చదువుకునే రోజుల్లో అన్ని సౌకర్యాలూ అలవాటవుతాయి. ఇప్పుడీ బతుకు దుర్భరంగా వుంటుంది.

* * *

అన్నమ్మ మూలుగుతూ పడుకుంది. అత్త యింత అన్నం ఒండి పిల్లలకు పెట్టింది. అన్నమ్మ అరికాళ్ళు మంటలంటే వందనం వాళ్ళింట్లోనుంచి ఆముదం సీసా తెచ్చి కాళ్ళకు రాసి మర్ధనా చేస్తోంది.

అన్నమ్మ మొగుడు దానియేలు వచ్చాడు. రావటం రావటమే అన్నమ్మ మీదకు విరుచుకుపడ్డాడు.

"మాణిక్యమ్మ గారి చేలోంచి సగం పనిలోనే వచ్చావంట, ఒళ్ళు బలిసిందా?" అంటూ మీదకు దూకబోతున్న దానియేలుని తల్లి ఆపి జరిగిన సంగతి చెప్పింది.

"రెండేళ్ళాగి కంటానని తిప్పుకుంటూ యెళ్ళివిగా ఆస్పత్రికి - అసలు నాకు చెప్పకుండా యిట్టాంటి పన్లు చేసావంటే పేణం తీస్తా" అంటూ అన్నమ్మని తిట్టి తిండి తిని పడుకున్నాడు.

మర్నాడు పనికి పోక తప్పలేదు అన్నమ్మకు. వారం రోజుల్లో మామూలు మనిషయింది. ఇంతలో జీపుల్లో మనుషులు రానే వచ్చారు. ఆపరేషన్లు చేయించమని మగాళ్ళతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆశలు పెడుతున్నారు.

"మళ్ళీ ఒచ్చిపడ్డారమ్మ. పోయిన తడవ నేనెట్టాగో తప్పించుకున్నా. మా ఆయన చేయిచ్చుకోవాల్సిందేనని గొడవ"

"అంత కుతిగా వుంటే ఆయన్నే చేపిచ్చుకోమనక పోయినావంటే"

"ఇంకా నయ్యం - మొగుడు చేయిచ్చుకున్నాక పెళ్ళానికి కడుపొస్తే యేం చేస్తా? ఆడాళ్ళం మనం చేయిచ్చుకోవటమే రైటు"

"నువ్వు చేయిచ్చుకున్నావంటే-"

"వచ్చే యేడు చేయిచ్చుకుంటా"

అన్నాలు తినేటప్పుడు అందరూ యివే మాటలు. మళ్ళీ చేలోకి దిగేదాకా అంతే. వందనం అందరి మాటలూ వింటూ కూచుంది. వందనానికి ఆపరేషన్ చేయించుకోవాలనీ వుంది. కొడుకుని కనాలనీ వుంది. కొడుకు లేడని అందరూ అంటున్నారు. మొగుడు కూడా 'కొడుకు పుట్టాలా, కోటప్పకొండకు ప్రభను కట్టాల' అంటూ తిరుగుతున్నాడు. కానీ కొడుకు పుడతాడని గ్యారంటీ యేంది? మళ్ళీ ఆడపిల్లే పుట్టుకొస్తే - యిట్టా యెన్ని తడవలని చూడాల? ఎన్ని తడవలైనా చూడాల్సిందే - యేమయిద్ది - యింకో ఆడపిల్ల పుడితే పుట్టుద్ది. తన ఒంట్లో ఓపికుంది. కాన్పులు తేలిగ్గానే అవుతున్నాయి. దేవుడేం చెయ్యదల్చుకుంటే అదే చేస్తాడు. దేవుడి మీద భారంవేసి పన్లోకి దిగింది వందనం.

ఆ రోజు మాపటేల నాగేశు పురుకులు పరుగుల మీద వచ్చాడు. వందనం పొయ్యి కింద మంట పెడతంటే పిల్లలిద్దరూ చెరో పక్కా చేరి కుతకుత వుడుకుతున్న అన్నాన్ని చూస్తున్నారు. పొద్దున రామ్ములక్కాయలు పప్పులో యేసింది. తొందరగా తినకపోతే అది కాస్తా చద్దోసన వస్తది. పిల్లలూ ఆవురావురంటన్నారు. వందనం పొయ్యిలో మరో నాలుగు పత్తి కట్టెలు యిరిచి పెట్టింది. మంట కాస్త పెరిగింది. పిల్లలు కూడా పుల్లల్ని పొయ్యిలోకి ఎగదోశారు. వందనం పిల్లలిద్దర్నీ పోయి దగ్గర్నించి యివతలకు లాగుతుండగా నాగేశు మంచి నీళ్ళు తాగి ఆయాసం తీర్చుకుని

"ఆప్రేసనంట చేయిచ్చుకోరాదూ" అన్నాడు.

"నువ్వు కొడుకు కావాలంటివిగా" అంది వందనం ఎత్తి పొడుస్తున్నట్టుగా.

"కొడుకు పుడతాడని గ్యారంటీ యేంది?"

తను అడిగే ప్రశ్న మొగుడు అడుగుతుంటే వందనం యేం చెప్పాలో తెలియక పూరుకుంది.

"ఇంకో రెండు శత్తులు పుట్టుకొస్తే యేం జేస్తా. నా మాటిని చేయిచ్చుకో" అన్నాడు. పోయినేడాది ఈ మాటంటే యింతెత్తున్న లేసిన మొగుడు ఈ యేడాది యెట్టా మారాడా అని ఆలోచించింది వందనం.

'ఈ మడిసికి నిలకడ లేదులే - యియ్యాల్టి మాట రేపటికుండదు. రేపటి మాట అవతల్నాటికుండదు' అనుకుని మాట్లాడకుండా పూరుకుంది.

మూడోనాడు పూర్నించి దిగిన తల్లిని జూసి నోరెళ్ళబెట్టింది.

"నువ్వాప్రేషను చేయించుకుంటావంటగదే - నీ మొగుడుకబురు జేసి రమ్మన్నాడు' ' అని రత్తమ్మ అంటంటే వందనానికి యేడుపొచ్చింది.

"యేందమ్మా కొడుకు లేకుండా యెట్టా. యింకో పాలన్నా చూడొద్దా" అని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"ఇంకోపాలి లేదు యేం లేదు. ఇయ్యాల సాయంత్రం ఆస్పత్రికి పోవాల్సిందే - నేను డాక్టరమ్మతో చెప్పొచ్చా" అన్నాడు నాగేశు. వందనానికి గుండెల్లో దడ పుట్టుకొచ్చింది. తన కడుపులో పుట్టిన ఆలోచనైతే యెట్టా వుండేదో ఈ మడిసింత హడావుడి చేస్తుంటే కాలూ చెయ్యి ఆడట్లేదు. రేపొద్దున ఆప్రేషనంట. పిల్లల్ని తల్లి చూసుకుంటది. తననెవరు చూసుకుంటారు? ఆప్రేషనేందో పాడేందో, ఆప్రేషన తర్వాత కడుపులో నొప్పొస్తదనీ, నడుం నొప్పొస్తదనీ అంటున్నారు.

"కాళ్ళు చేతులూ గుంజకపోతన్నయే" అని మార్తమ్మ రోజూ గోల. ఈ ఆప్రేషన్ చేయిచ్చుకుంటే పెద్దాప్రేషను తప్పదంటారు.

"నువ్వు చేయిచ్చుకోరాదూ?" అంది వందనం.

"నే చేయిచ్చుకుంటే - నేనడ్డం బడితే - నువ్వు సంపాయిచ్చి పోషిత్తావా సంసారాన్ని-"

"నేనడ్డం బడితే నువ్వు కూడొండి పెడతావా పిల్లలకి" అంది వందనం.

"నీ నోరుబడ - మాటకి మాట అంటం నేర్చావు. నోరు మూసుకుని నే చెప్పినట్లు యింటావా యినవా?" అన్నాడు చెయ్యి పైకెత్తి. రత్తమ్మ అల్లుడి చెయ్యి పట్టుకుని బైటికి తీసుకపోయింది. వందనం యేడుపుకి అన్నమ్మ పరిగెత్తుకుంటూ వచ్చింది. వందనం చెప్పింది విని

"ఆ నారాయణగాడు పల్లెలో అందరు మొగాళ్ళకీ పురెక్కిస్తన్నాడు. నీ మొగుడికి పుట్టిన బుద్ధిగాదిది. ఆడు చెడగొట్టాడు" అంది.

"మన బంగారం మంచిదైతే వూళ్ళో వాళ్ళననుకునే పనేం వుంది. ఇప్పుడేం చెయ్యాలి' అని యేడ్చింది వందనం.

ఎవరు చెప్పినా నాగేశు వినలేదు. సాయంత్రం ఆరింటికి తలకపోసుకుని, ఉతికిన చీరె కట్టుకుని వందనం ఆస్పత్రికి వెళ్ళి చేరింది. అక్కడ యిరవైమంది దాకా వున్నారు. పన్నెండు మందికి రెండు రోజుల్నాడు ఆప్రేషను చేశారు. ఐదుగురికి ఈ రోజు పొద్దున చేశారు. మిగిలిని వాళ్ళకి వందనంతో పాటు.

బాధేం లేదన్నారు చేయించుకున్నవాళ్ళు. కొందరు లేచి తిరుగుతున్నారు. మర్నాడు యింటికి పోతామని కొందరంటున్నారు. వందనానికి అంతా మాలోకంగా వుంది. రాత్రికి నిద్ర పట్టలేదు. అన్నమ్మ పిల్లల్ని అత్తకప్పగించి వందనానికి తోడుగా వుందామని వచ్చింది. ఇద్దరూ అర్ధరాత్రి దాకా మాట్లాడుకుంటుంటే నర్సు వొచ్చి తిట్టింది. మెదలకుండా

పడుకున్నారుగాని యిద్దరూ జాగారమే చేశారు. ఆపరేషను అయిపోయింది. వేరే బాధలేమీ లేకుండా యింటికొచ్చేసింది.

"ఫోన్లే - ఈ పిల్లలే తనకాదారం, అన్నలు, తమ్ముళ్ళు అమ్మనేం చూసి చస్తన్నారు. - అక్కాయి దగ్గర వుంటంలా, తను కూడా ముసల్దయితే ఈ పిల్లల దగ్గరే పడుంటది. ఇద్దరికీ కాత్త చదువు చెప్పిచ్చుకుని వుద్యోగాల్లో యేయిత్తే వాళ్ళే యింత తిండి పెడతారు' అనుకుంది తన దగ్గరకొచ్చిన పిల్లల్నిద్దర్నీ గుండెలకదుముకుంటూ.

రోజులు గడిచిపోతన్నాయి. వందనం భయపడ్డట్టు యే నడుం నొప్పీ రాలేదు. సంవత్సరం గిర్రున తిరిగొచ్చింది. ఈ సారి కోటప్ప కొండ తిరణాలకు వందనం పోలేదు.

నాగేశు "వచ్చేయేడు ప్రభను కట్టకపోతా" అన్నాడు.

"కొడుకు పుడితే ప్రభను కడతానంటివిగా కొడుకుని కనకుండానే, కొడుకు లేకుండానే ప్రభను కడతావా" అనడిగింది వందనం నవ్వుతా.

అంతే. ఆమె వీపు మీద పిడిగుద్దులు పడ్డాయి.

"నాకు కొడుకు లేడంటావా? అంత చాతగాని వాడ్నంటావా? నేను కొడుకుని కనలేనా? నువ్వే కనలేనిదానివి. నువ్వు గొడ్డుబోతే లోకంలో ఆడాళ్ళు లేరా - ఆసలు నీకూ నాకూ సమ్మందం లేదు. నేను మారు మనువు చేసుకుంటాను" అని తాడెత్తున లేచాడు.

యేమాత్రం తగ్గకుండా అట్టానే బైటికి పొయ్యాడు. వందనం దెబ్బలకు యేడవాలని కూడా మర్చిపోయి అట్లాగే నిలబడింది. సాయంత్రానికి అన్ని విషయాలూ బైటికొచ్చాయి. రెండునెల్లనుంచీ రాయబారాలు నడుస్తున్నాయి. రేపోమాపో ముహుర్తాలు పెట్టుకుంటారు.

నాగేశుకి యింటిపేరు నిలబెట్టటానికీ, తలకి కొరివి పెట్టటానికీ కొడుకు కావాల్సిందే. విషయం తెల్సిన వాళ్ళొచ్చి వందనంతో -

"నీకేం పొయ్యేకాలం వచ్చిందే - ఆప్రేషనెందుకు చేయిచ్చుకు చచ్చావ"ని అడిగితే వందనం లబ్బున మొత్తుకుంది.

"ఆ సచ్చినాడే - అది బలవంతానే ఆస్పత్రికి పొయ్యాను. కావాలంటే మా అమ్మ నడగండి. అన్నమ్మ నడగండి" అని యేడ్చింది. అన్నమ్మ వందనం మాట నిజమని చెప్పటమే కాదు. నాగేశుని బూతులు తిడతా బజారుకొచ్చింది. ఎక్కడ్నించి వచ్చాడో దానియేలు వచ్చి అన్నమ్మని చావగొడతా యింటికి లాక్కుపొయ్యాడు.

వందనం ఆ రోజు పొయ్యి రాజెయ్యాలా. అన్నమ్మే మొగుడికి తెలియకుండా యింత అన్నం, చింతకాయ పచ్చడీ పంపించింది. వందనం పిల్లలకు పెట్టి తను తినకుండా పడుకుంది. నాగేశు వచ్చి అది శుభ్రంగా తిని నిద్రపోయాడు. అన్నమ్మ యెవరిచేత కబురు చేసిందోగాని రత్తమ్మ పెద్దకూతుర్నీ, పెద్దల్లుడినీ కూడా తీసుకొచ్చింది. నయానా భయానా

కూడా లొంగలేదు నాగేశు. అతనికి వూళ్ళో మొగోళ్ళ సపోర్టు బాగానే దొరికింది. చివరికి యేం చెయ్యాలో తెలియక రత్తమ్మ కూడా కూతుర్నే తిట్టింది.

పంచాయితీ పెట్టించమంది అన్నమ్మ.

"పంచాయితీలో యేం తెలుద్ది? వందనానికి యిడాకులిస్తాడు. ఇద్దరు పిల్లలతో వందనం యేం కావాలి? వాడు అందరికీ తాగబోయించి వాడికనుకూలం చేసుకుంటాడు. పొరుగూరోళ్ళం తామేం చెయ్యగలరు? ఈ పిల్లనేం చెయ్యాలా? దాని పిల్లల్నేం చెయ్యాలా? ఇదంతా చుట్టుకుని చుట్టుకుని యాడికి బోద్ది?"

రత్తమ్మ కంటినుండి ధార అగలేదు. ముగ్గురాడ వాళ్ళకూ ముద్ద దిగలేదు. పంచాయితీలో రత్తమ్మ అనుకున్నదే జరిగింది. నాగేశు కొడుకు కావాలనుకోవటంలో యెవరికీ తప్పు కనిపించలేదు.

"మొగోడన్నాక కొడుకుని కనాల. ఇంటి పేరివ్వాల. వాడి చేత్తో యింత మట్టేయించుకోవాల."

ఇన్ని పన్లు జరగాల్సుండగా "వందనం కొడుకుని కనకుండా అప్రేషనెట్టా చేయించుకుంటది?"

నాగేశు యిద్దరాడపిల్లల్ని చూసి భయపడి మళ్ళీ ఆడపిల్లలు పుడతారేమోనని మాటవరసకు "అప్రేషన్ చేయించుకుంటావా" అని అడిగితే "అదది మంచీ చెడ్డా ఆలోచించకుండా యెగేసుకుని పోయి చేయించుకోటమేనా?"

యెంత గోల చేసినా, యెవరు యేడ్చినా, యెవరు అరిచినా ఈ మాటలకు తిరుగులేదు. కావాలంటే తప్పుకడతాడు.

సాయంత్రం దాకా అరిచి అరిచి సాయంత్రానికి యెవరిళ్ళకు వాళ్ళు వెళ్ళారు. వందనాన్ని తనతోపాటు రమ్మంది రత్తమ్మ.

"ఒద్దు, ఈ వూరొదిలి యెందుకెళ్ళాలా - అ మడిసి లేకపోతే వూరు వూరుగాకుండా వల్లకాడైపోద్దా, పిల్లలు యిక్కడుంటే వాడిగ్గూడా కాస్త వాళ్ళను చూడాలనుంటది. పిల్లలకి తండ్రెనుమంటాడో తెలియాలిగా, యెప్పుడైనా యెక్కడైనా నీ రెక్కల కష్టమేగదా నిన్ను బతికిచ్చేది" అంది అన్నమ్మ.

వందనానికి తల్లో పెద్ద మంట మండుతున్నట్టుంది.

"పదేనేళ్ళప్పుడు ఈ వూరొచ్చింది. వొచ్చి పదేళ్ళయింది. ఇప్పుడు వూరుగాక వల్లకాడా అంటది అన్నమ్మ. వల్లకాడు గాక మరేంది? యేం చేసిందీ వూరు - ఈ మడుసులు. వచ్చిందగ్గర్నించీ రేత్రింబగళ్ళనకుండా చాకిరీ చేసింది. తను కాపరానికొచ్చినపుడు నాగేశు కొంపెట్టావుంది? మట్టిగోడలు పడిపోతన్నాయి. లోపల నేల యింతింత లోతున గుంటలు

పడిపోయింది. ఆ గోడల్ని రాళ్ళు పెట్టీ, మట్టి మెత్తీ రెండేళ్ళపాటు నానా యాతనా పడి పైకి లేపింది. ఇంటికి యెంత మట్టీ చాల్లేదు. ఆ మట్టి కోసం యెంతెంత దూరాలో తిరిగింది. వూరంతా తిరిగి పేడ పోగేసింది. అలికి ముగ్గు పెట్టిన యిల్లు నవ్వుతా వుంటే తనూ నవ్వుకుంది గానీ యేదో ఒకరోజు ఈ యింట్లో తన కడుపు భగ్గుమంటుదనుకోలేదు.

ఇంటిచుట్టూ కంది కట్టెతెచ్చి దడి కట్టింది. ఇంటి మీదికి సొరపాదు, కాకరపాదు, బీరపాదు పాకించింది. ఈ యిత్తనాల కోసం యిల్లిల్లూతిరిగింది. ఈ యింటిమీద కాకర పూసినప్పుడే తన కడుపున పెద్దపిల్ల పడింది.

ఇప్పుడా కాకర చేదంతా తన బతుకులోకి దిగబడింది. ఇప్పుడీ యింట్లోంచి పోవాల. యెక్కడికి? మగాడు లేని బతుకయింది. మగాళ్ళకేం - కుక్కలల్లే యెక్కడబడితే అక్కడే వుంటారు. తనకంటూ ఒక మడిసి వుండడు.

పిల్లలు పుట్టరని కట్టుకున్నోడే వొదిలేస్తే యింకొకడు తనని మళ్ళీ యెందుక్కట్టు కుంటాడు. తను వూరందరి పోరంబోకు అవుతది. మొగుడు తనని పంట పండని బీడు భూమల్లే చేశాడు. పోరంబోకు చేశాడు.

ఈ మాయదారి డాక్టర్లు, ఈ మాయదారి ఆప్రేషన్లూ ఆడాళ్ళకోసం యియ్యొకటి, కనిపెట్టారు. ఆ కాంపౌండరు సచ్చినాడు మొగుడెంట పడితే, ఆడు మెహర్బానీకో మరింకెందుకో పదపదమని నెట్టాడు. ఇప్పుడు అబ్బే నాకేం తెలుసని చేతులు తిప్పుతున్నాడు తనకక్కర్లేదని వొదిలేశాడు. తనీ పిల్లముండల్ని పెంచాల. ఈళ్ళ బతుకెట్టా బుగ్గయిద్దో తెలవదు. యేందీ ఆడ జల్మ.

పెళ్ళి పెళ్ళని పెద్దమడిసైన కాడ్నించీ వూపిరాడ్నీయ్యక పోతిరి. పెళ్ళయినాక రెండేళ్ళు దాటినా కడుపు పండలేదని గోలగోల చేస్తిరి. అప్పుడు తన కడుపులో దెయ్యి మంత బియ్యిం. పిల్లలు పుడతారా లేదా అని - వరసనే పిల్లలు పట్టుకొత్తంటే యిక మొగపిల్లాడు కావాలని -

మజ్జలో మొగుడు సచ్చినోడు యిట్టా చేశాడు. తన బతుకెందుకు?

ఆ మొగుడికీ ఈ పిల్లలకీ తనకీ ఈ ముడెందుకు? ఈ ముడి పాడుగాను యిది వున్నట్టూ వుండదు. లేనట్టూ వుండదు. ముడి సొంతం పడదు. సొంతం వూడదు. ఈ మొగుడు వొదిలేసినా బతకాల. పిల్లలు వొదిలేసినా బతకాల.

ఈరమ్మ బతకటంలా. డెబ్బయ్ యేళ్ళు. కళ్ళు సరిగ్గా కనపడవు. వేరిశనక్కాయలూ, బటానీలు, జీళ్ళు అమ్ముద్ది. రూపాయి మిగిలితే వండుకు తింటది. లేకపోతే అడుక్కుతింటది.

ఊహ వొచ్చిందగ్గర్నించీ యింటిని బాగుసేత్తాం. ఇల్లుండదు. వయసొచ్చిందగ్గర్నించీ

పొలాలు బాగుచేత్తాం. పొలం వుండదు. కట్టుకున్నాడ్ని కంట్లో పెట్టుకు చూత్తాం. కన్నుపొడి సేత్తాడు. పిల్లల్ని కనిపెంచుతాం. రెక్క లొచ్చియెగిరిపోతారు. మనం మాత్రం పేణం వున్నంతకాలం దాన్ని నిలుపుకోటానికి తిప్పలు పడాల.

అంతేనా మానవ జల్మ.

ఇంతకు తప్ప మరేందో యెక్కడా వందనం మనసుకి అందటం లేదుగానీ యేదో వుందని ఆమెకి మనసు లోపల్నించి అనిపిస్తోంది.

తనని అగాధంలోకి తోసెయ్యి జూస్తున్న నిరాశను నెట్టేసి తను లేచి నిలబడటానికి వందనం చేస్తున్న యుద్ధం గురించి తెలిస్తే, ఆలోచిస్తే గుండెలవిసి పోతాయి.

వందనం తనతో తాను ఒక సమాధానానికి రావటానికి బ్రహ్మాండం బద్దలయ్యేంత ప్రయత్నం చేస్తోంది.

వందనానికి యిది యింకో కాన్పులాగ వుంది.

"యేడుపేగాదు సంబరాలూ వున్నాయి. ఈ పాతికేళ్ళలో యింత యేడుపు తనకెప్పుడూ లేదు.

పనిచెయ్యటం తనకెప్పుడూ యేడుపుగాదు.

చేసిన పని చూసుకుంటే యెప్పుడూ గుండెల్నిండా సంతోసమే -

కడుపుపంట చూసుకుంటే యెప్పుడూ కన్నులపండగే ఈ మొగుడు సచ్చినాడి మూలానే గాని తనకింత యేడు పెన్నడూ లేదు.

అన్నమ్మ సావాసం వుంది. ఆడపిల్లలు తనను దిక్కులేని దానిలా వొదిలెయ్యరు.

నోరు మంచిదైతే వూరు మంచిదవుద్ది.

ఇంటికి గోడలు లేపిందంటే వూళ్ళో యెవరి సాయం లేకుండానే జరిగిందా? రాళ్ళిచ్చారు. మట్టిచ్చారు. పేడకళ్ళు యిచ్చారు.

పల్లెల్లో పిల్లాజెల్లా నుంచి అన్నమ్మదాకా తలో చెయ్యి యేశారు.

తొలి కాన్పుకి కూడా పుట్టింటికి పోలేదుగా, ఇక్కడావాళ్ళే గట్టెక్కించారు.

కూలి పెంచాలని గోలచేసినపుడు పల్లెంతా ఒకటవలా?

నాగేశు వొదిలేశాడని వూరు తనను వొదులుద్దా? వూరిని తను వొదులుద్దా?

మంచీ చెడ్డా అన్నీ వున్నాయి వూళ్ళో. నేయిం అన్నాయిం అన్నీ వున్నాయి వూళ్ళో.

తను నేయిం పక్కనుంది. నాగేశు అన్నేయిం పక్కనున్నాడు.

పంచాయితీలో మొగోళ్ళంతా అన్నేయిం పక్కనున్నా అన్నమ్మలాంటి ఆడోళ్ళు

తనపక్కే వున్నారు. ఇయ్యాల ఆళ్ళకి బలంలేదు. అన్నాయమై పోయిన తను వూరొదిలి యెళ్ళిపోతే యెప్పటికీ నాయానికి బలంరాదు. తనుండాల. ఈ ఆడోళ్ళ కళ్ళెదట తిరుగుతుండాల. ఇంకెవురన్నా తనసుమంటి ఆడోళ్ళుంటే ఆళ్ళపక్కన నిలబడాల. నాయానికి బలం సంపాయిచ్చాల.

మొగోళ్ళంతా కల్సి వూర్ని వల్లకాడు చేత్తే -

వల్లకాడుని వూరు చేసుకోవాల్సింది తనసుమంటి ఆడోళ్ళే.

కూలిపోతన్న యిల్లు బాగుచేసుకున్నట్టే బతుకూ బాగుచేసుకోవాల."

వందనానికి పురుటి నొప్పులు కొత్తకాదు గానీ యిప్పుడు ఈ నొప్పులు కొత్తగానే వున్నాయి.

"ఇవి తన బతుకు కోసం తను పడుతున్న నెప్పులు. ఇప్పుడు యింకో పసిగుడ్డుకి జల్మం యియ్యటానిక్కాదు - ఈ బాధ, ఈ యాతన.

తన బతుక్కితనే పేణం పోసుకోవాల. తన బతుకుని తనే కొత్తగా మళ్ళోసారి కనాల.

ఈ పురిటి నెప్పులు అందుకు - తన బతుక్కోసం."

వందనానికి ఈ నొప్పులు వుధృతమవుతున్న కొద్దీ వుపశాంతిగా వుంది.

మరోసారి తను పుడుతున్నట్టుగా వుంది.

"తన పుటకకు తనే నెప్పులు పడటం" - యేడుస్తూ వందనం నవ్విన నవ్వు వేకువజాములా వుంది.

ఒక చెంపనుంచీ రాత్రి తెల్లవారుతుంటే యింకో చెంప వందనం మనసు తేటపడుతోంది.

కళ్ళల్లోకి యెక్కడ్నించి తెచ్చుకున్న ప్రాణమో వచ్చి చేరుతోంది.

జీవితాన్ని ప్రసవించటానికి వందనం సన్నద్దమవుతోంది.

*(11.5.1997, ఆదివారం వార్త)*